PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 98॥ బుధవారం ॥ 2-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-






02 సెప్టెంబర్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:05 సూర్యాస్తమయం - సా. 6:25 తిథి పంచమి ఉ. 6:12 వరకు తరువాత షష్ఠి తె. 4:25ం వరకు సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం భరణి రా. 1:41ం వరకు తరువాత కృతిక యోగం ధ్రువ రా. 9:06 వరకు కరణం తైతుల ఉ. 6:12 వరకు గరజి సా. 5:19 వరకు వర్జ్యం ఉ. 11:54 నుండి మ. 1:26 వరకు దుర్ముహూర్తం ఉ. 11:51 నుండి మ. 12:40 వరకు రాహుకాలం మ. 12:15 నుండి మ. 1:48 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:10 వరకు గుళికాకాలం ఉ. 10:43 నుండి మ. 12:15 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:29 నుండి తె. 5:17 వరకు అమృత ఘడియలు రా. 8:44 నుండి రా. 10:16 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## మత్స్యకార కుటుంబాలకు..
# పింఛన్ల పంపిణీ

### మొగల్తూరులో 'పేదల సేవలో' కార్యక్రమం

**మత్స్యకార కుటుంబాలతో మమేకమైన ముఖ్యమంత్రి**

**సంక్షేమ పథకాల అమలుపై ఆరా.. బోటు ప్రయాణం**

పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజక వర్గంలోని మొగల్తూరులో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్స్యకార కుటుంబాలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసి వారి యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎలా చేరుతున్నాయనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో భాగంగా పింఛన్ లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు.

మొగల్తూరు, సెప్టెంబర్ 1: కుటుంబ పరిస్థితులు, జీవనోపాధి, ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాల గురించి తెలుసుకుని వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. సముద్రంపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలకు తరువాయి 2 వ పేజీలో..

## ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా హైదరాబాద్



**హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక ముందడుగు**

**హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో సానుకూల చర్చలు**

**ప్రపంచ స్థాయి అవకాశాల కల్పన: రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 1: ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడానికి ముందుకు రావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన అన్నారు. బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్, అమెరికాలోని బోస్టన్‌కు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రపంచ స్థాయి –2 వ పేజీలో..



## తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ గవర్నర్

### కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు

**శ్రీవేంకటేశ్వర స్వామివారికి మొక్కులు**

**తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు**

**శివప్రతాప్ శుక్లకు ఆలయ మర్యాదలు**

తిరుమల, సెప్టెంబర్ 1

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్ల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక మొక్కులు సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేయగా, గవర్నర్ భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి అనుగ్రహం రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు గవర్నర్‌కు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి సత్కరించారు. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా అన్ని మర్యాదలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, శాంతి, అభివృద్ధి కోసం స్వామివారి ఆశీస్సులు కోరినట్లు గవర్నర్ తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రజల జీవితాల్లో సౌభాగ్యం నెలకొనాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, ఆయురారోగ్యాల కోసం కూడా ప్రత్యేకంగా ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రతిరోజూ దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా తరచూ శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందుతుంటారు. ఈ నేపథ్యంలో తెలంగాణ గవర్నర్ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. గవర్నర్ శివప్రతాప్ శుక్ల కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకోవడం భక్తుల్లో ఆనందాన్ని కలిగించింది.

## విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి
# రూ.కోటి ప్రమాద బీమా చెక్కు

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కు అందజేత**



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా నిలిచింది. ట్రాన్స్‌కో హుజూరాబాద్ పరిధిలో గ్రేడ్-2 ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ 2025 అక్టోబర్ 1న ప్రమాద వశాత్తు మృతి చెందిన శంకర్ రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ప్రమాద బీమా సాయాన్ని అందించింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 1: ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మంగళవారం ప్రజాభవన్‌లో శంకర్ రెడ్డి సతీమణి బోడ స్వాతికి రూ.కోటి బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులు, పిల్లల విద్యాభ్యాసం, భవిష్యత్ అవసరాలపై ఆరా తీశారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా తరువాయి 2 వ పేజీలో..



## సాంకేతికతపై ప్రత్యేక దృష్టి

### ఎస్‌సీఓ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ

**సంభాషణ, దౌత్యమే సమస్యల పరిష్కార మార్గమన్న ప్రధాని**

**ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానానికి పిలుపు**

బిష్కెక్, సెప్టెంబర్ 1: ప్రధానమంత్రి నరేం ద్ర మోదీ కిర్గిజ్‌స్తాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగి న 26వ షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్ సీఓ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని, ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న వివిధ ఘర్షణలు, ఉద్రిక్తతల నేపథ్యంలో సంభాషణ, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుం దని భారత్ వైఖరిని తరువాయి 2 వ పేజీలో..



## నిడదవోలులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేసిన మంత్రి కందుల దుర్గేష్**

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని హామీ**

నిడదవోలు, సెప్టెంబర్ 1: వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నేరుగా నిడదవోలు చేరుకుని పట్టణంలోని 13వ వార్డు ఇందిరానగర్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందజేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నిడదవోలు నియోజకవర్గవ్యాప్తంగా మొత్తం 33,990 మంది లబ్ధిదారులకు రూ.14.97 కోట్ల విలువైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు తరువాయి 2 వ పేజీలో..

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు హైకోర్టు ఊరట



**పథకాల అమలుపై మధ్యంతర స్టే ఎత్తివేత**

తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై సింగిల్ జడ్జి విధించిన మధ్యంతర స్టేను చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం ఎత్తివేసింది.ఈ రెండు సంక్షేమ పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 1: 2014 నుంచి ఈ పథకాలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ వ్యక్తిగత హోదాలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు.రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, 2014 నుంచి అమల్లో ఉన్న సంక్షేమ పథకాలను పిటిషనర్ సవాల్ చేశారని, వాటి అమలుతో పిటిషనర్ హక్కులకు ఎలాంటి భంగం కలగలేదని కోర్టుకు తెలిపారు. పిటిషనర్ ఈ రెండు పథకాలలో ఏ పథకానికీ లబ్ధిదారుడు కాదని కూడా పేర్కొన్నారు.ఈ పిటిషన్ ప్రజాప్రయోజన వ్యాజ్యం పరిధిలోకి రాదని అడ్వకేట్ జనరల్ వాదించారు. షాదీ ముబారక్ తరహా పథకాలను సుప్రీంకోర్టు అనుమతించిందని, కల్యాణలక్ష్మి కూడా అదే తరహా సంక్షేమ పథకమని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేసే అంశాలను సింగిల్ జడ్జి కాకుండా డివిజన్ బెంచ్ విచారించాల్సి ఉంటుందని, అందువల్ల ఈ పిటిషన్ సింగిల్ జడ్జి ముందు విచారణకు అర్హం కాదనితరువాయి 2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

**మేషం:** కీలక సమయంలో ఆత్మీయుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల నుండి ప్రశంసలు అందుతాయి. చాలకాలంగా పూర్తికాని పనులు పూర్తి చేస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి.

**వృషభం:** ఉద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. ఇంటా బయట బాధ్యతలు ఒత్తిడికి గురిచేస్తాయి. నూతన రుణాలు చేయవలసి రావచ్చు. వ్యాపార విషయంలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. వృత్తి, వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉ ఒడదు.

**మిధునం:** వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలు తప్పవు. ముఖ్యమైన పనులలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. దైవదర్శనం చేసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వ్యాపారమున సమస్యాత్మక వాతావరణం ఉంటుంది.

**కర్కాటకం:** వ్యాపారాల విస్తరణకు అవరోధాలు తొలగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో జీతభత్యాలు విషయంలో అనుకూలత కలుగుతుంది. చిన్ననాటి మిత్రులతో విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి మరింత పుంజుకుంటుంది.

**సింహం:** భూ సంబంధిత వివాదాలు మరింత చికాకు పరుస్తాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. మానసిక చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగ నిర్వహణలో లోపం వలన అధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

**కన్య:** చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక వృద్ధి,పాత ఋణాలు తీర్చగలుగుతారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిరుద్యోగులకు తగిన అవకాశాలు లభిస్తాయి.

**తుల:** ఉద్యోగమున అధికారులతో వాదాలకు వెళ్లకపోవడం మంచిది. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. ఇంటాబయట సమస్యలు అధికమవుతాయి. వృత్తి వ్యాపారాలలో తొందరపడి సొంత నిర్ణయాలు తీసుకుని నష్టపడతారు.

**వృశ్చికం:** చేపట్టిన వ్యవహారాల్లో కార్యసిద్ధి కలుగుతుంది.వృత్తి,ఉద్యోగాల్లో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి . కీలక సమయంలో కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి.వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.ఆర్థిక వ్యవహారాలు సంతృప్తి కరంగా సాగుతాయి.సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

**ధనస్సు:** సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. మొండి బాకీలు వసూలవుతాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

**మకరం:** వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికామౌతుంది. ఇతరులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నూతన ఋణ యత్నాలు కలసిరావు. ఆర్థిక వ్యవహారాలు గందరగోళంగా ఉంటాయి. పుణ్యక్షేత్ర దర్శనాలు చేసుకుంటారు.

**కుంభం:** ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. చేపట్టిన పనులు వ్యయ ప్రయాసలుతో కాని పూర్తికావు. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ఇంటా బయట ప్రతికూల వాతావరణం ఉంటుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది.

**మీనం:** వ్యాపారపరంగా కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. నిరుద్యోగులకు అప్రయత్నంగా అవకాశములు అందుతాయి. కొన్ని వ్యవహారాలలో తీసుకున్న నిర్ణయాలు తరువాత కాలానికి ఉపయోగపడతాయి.



# ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

విద్యను తెలంగాణ యువతకు అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు ఇది కీలక ఫలితమని పేర్కొన్నారు. విదేశాలకు వెళ్లకుండానే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను హైదరాబాద్‌లోనే అభ్యసించే అవకాశం యువతకు లభించనుందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీతో పాటు దాని అనుబంధ విద్యా విభాగాలు తెలంగాణలో ప్రత్యేక కోర్సులు, ఎంపిక చేసిన విద్యా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నాయని సీఎం వెల్లడించారు. అలాగే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (సోఆస్), ఇంపీరియల్ కాలేజ్ లండన్, లండన్ బిజినెస్ స్కూల్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో జరిగిన చర్చలు కూడా సానుకూల ఫలితాలు ఇచ్చాయని తెలిపారు. అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)తో పాటు పలు ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలతో నిర్వహించిన సమావేశాలు కూడా ఆశాజనకంగా సాగాయని సీఎం పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ యువత ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన అవకాశాలను తమ స్వరాష్ట్రంలోనే పొందగలరని చెప్పారు. విద్యా రంగంలో తెలంగాణను అంతర్జాతీయంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.విద్యా కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు, వివిధ రంగాల నిపుణులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు వంటి అంశాల్లో అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రాష్ట్రంలో విద్యా, పరిశోధన రంగాలు మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ యువతను ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నైపుణ్యాలు, క్రీడలు, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్‌ను ప్రపంచ విద్యా శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాల సాధనలో ఈ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషించనున్నాయని ఆయన తెలిపారు.




# విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి ప్రమాద బీమా చెక్కు

మొదటి పేజీ తరువాయి

కల్పించారు. శంకర్ రెడ్డి కుటుంబానికి అందించిన బీమా సాయం వారి భవిష్యత్‌కు కొంత మేర ఆర్థిక భరోసా కల్పిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బీమా మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, భవిష్యత్ ప్రణాళికల కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగి సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు నిరంతర సేవలు అందించేందుకు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటారని డిప్యూటీ సీఎం అన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాలు సంభవించిన సందర్భాల్లో ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అందుకే సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఉద్యోగుల భద్రత, బీమా సదుపాయాలు, కుటుంబాల ఆర్థిక రక్షణకు అవసరమైన కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు నిస్సంకోచంగా విధులు నిర్వర్తించేలా భరోసా కల్పించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## పింఛన్ల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో కలిసి ముఖ్యమంత్రి కొంతసేపు బోటులో ప్రయాణించారు. మత్స్యకారుల దైనందిన జీవన విధానం, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. వారి వృత్తికి సంబంధించిన అంశాలపై మత్స్యకారులతో చర్చించారు. మత్స్యకారుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. తీరప్రాంత ప్రజల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 'పేదల సేవలో' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## సాంకేతికతపై ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి

మరోసారి స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం కోసం సభ్య దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యుద్ధాలు, ఘర్షణలు ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, పరస్పర చర్చలు, సహకారం, దౌత్య సంబంధాల ద్వారానే వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో శాంతి నెలకొల్పేందుకు ఎస్‌సీఓ వేదిక కీలక పాత్ర పోషించగలదని అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదం ప్రపంచానికి అతిపెద్ద ముప్పుగా మారిందని ప్రధాని అన్నారు. ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అన్ని దేశాలు అవలంబించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఎలాంటి ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతు ఇచ్చే చర్యలను అంతర్జాతీయ సమాజం కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా అనుసంధానం, సాంకేతికత, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధి, యువత భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రధాని మోదీ ప్రాధాన్యం ఇచ్చారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక, డిజిటల్ అనుసంధానం పెరగడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. యువతలో సృజనాత్మకత, పారిశ్రామికవేత్తల ఆలోచనలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. స్టార్టప్ ఎకోసిస్టమ్, సాంకేతిక ఆవిష్కరణల రంగంలో భారత్ సాధించిన పురోగతిని ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సభ్య దేశాల మధ్య జ్ఞాన మార్పిడి, పరిశోధన, సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా ఎస్‌సీఓ దేశాల అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎస్‌సీఓ దేశాల మధ్య సాంస్కృతిక, నాగరికతల పరమైన అనుబంధా లను మరింత బలోపేతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ క్రమంలో తొలి ఎస్‌సీఓ సివిలైజేషన్ డైలాగ్ ఫోరం (నాగరికతల సంభాషణ వేదిక)ను భారత్‌లో నిర్వహించేందుకు సిద్ధం గా ఉన్నామని తెలిపారు. సభ్య దేశాల మధ్య పరస్పర అవగాహన, సాంస్కృతిక సహకారం, ప్రజల మధ్య సం బంధాల బలోపేతానికి ఈ వేదిక దోహదపడుతుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌కు హైకోర్టు ఊరట

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వాదించింది. పథకాల అమలుపై విధించిన మధ్యంతర స్టేను తొలగించాలని కోరింది.ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి విధించిన స్టేను ఎత్తివేసింది. దీంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు కొనసాగేందుకు మార్గం సుగమమైంది.





# నిడదవోలులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

మొదటి పేజీ తరువాయి

మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు పట్టణ పరిధిలో 4,081 మంది లబ్ధిదారులకు రూ.1.83 కోట్ల పింఛన్ నగదు అందించినట్లు వెల్లడించారు. పింఛన్లు సకాలంలో లబ్ధిదారుల చేతికి చేరేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా 28 మంది అర్హులైన వితంతువులకు పింఛన్లు మంజూరు చేసి రూ.1.12 లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా పేద, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ పేదల సంక్షేమం విషయంలో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదని కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, డయాలసిస్ బాధితులకు రూ.10,000, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000 చొప్పున పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు త్వరలోనే కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. పింఛన్లతో పాటు ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా అర్హులందరికీ అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

శ్వేత

# సంపాదకీయం

**బుధవారం 2-9-2026**

# మరోమారు సిజెపి ఆందోళన!

కాక్రోచ్ జనతా పార్టీ మరో ఆందోళనకు సిద్ధమవుతోంది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న ఈ మార్చ్ చేపడుతోంది. గతంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా కేసుల ఎత్తివేత, విద్యార్థులకు పరిహారం వంటి హామీలను కేంద్రం ప్రకటించింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే హామీలు అమలు చేయాలని గతకొంత కాలంగా సిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ అంశంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవాల్సి నంత అత్యవసర పరిస్థితి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో మరోమారు ఆందోళన చేస్తే ఢిల్లీలో ఉద్రిక్తతలు నెలకొంటాయని, మార్చ్‌కు అనుమతి నిరాకరించాలని రిటైర్డ్ పోలీస్ అధికారి సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతిభద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ దగ్గర జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ సంస్థలకు సమీపంలో నిర్వహించే నిరసనలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ కోరారు.

నిరసనలు నిర్వహించకూడని ప్రాంతాలు లేదా రక్షిత ప్రాంతాలను సహేతుకమైన పరిధిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశానికి సంబంధించిన అనేక విషయాలను ఇంకా పరిశీలించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రతి అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించలేదని సీజేఐ స్పష్టం చేశారు. ముందుగానే దీనిపై ఎలాంటి నిర్ణయాలు ప్రకటించ లేమని సుప్రీం స్పష్టం చేసింది. అలాగే నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు. అన్ని అంశాలను మేము పరిశీలించలేం. ప్రతి విషయంపైనా వ్యాఖ్యానించం. మేము ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించండని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ 'తటస్థ అంపైర్'గా అభివర్ణించారు. నిరసనలకు సంబంధిం చిన విస్తృత విధానపరమైన, శాంతిభద్రతల అంశాలపై సంబంధిత వర్గాలు చర్చించు కోవాలని సూచించారు.

ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు సీజేపీ తాజా నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు కోర్టుకు తెలియజేశారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నాయని, అందువల్ల నిరసన మార్చ్‌ను బ్రిక్స్ సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఆయన వాదించారు. అయితే సీజేఐ స్పందిస్తూ.. 'ఇవి శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు. నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని మేము విశ్వసిస్తున్నాం, ఆశిస్తున్నాం. ప్రస్తుతానికి మేము జోక్యం చేసుకోవడానికి బలమైన కారణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే.. పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మొత్తంగా ఇప్పుడు సెప్టెంబర్ 5 మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో ర్యాలీతో నిజంగానే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందా అన్నదే ప్రశ్న. ఎందుకంటే గత ఆందోళనలో అసాంఘిక శక్తులు చేరాయి. ఖలిస్తాన్, ఇస్లామిక్ ఉగ్రవాదులు చేరారన్న సమాచారం ఇంటిలిజెన్స్ వద్ద ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

## వెయ్యి రోజుల ప్రజా పాలనలో ఆర్టీసీకి కొత్త ఊపు



**మహాలక్ష్మి పథకంతో మహిళలకు భారీ ప్రయోజనం**

**విద్యుత్ బస్సులు, కొత్త సేవలతో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు**

**ఉద్యోగుల సంక్షేమం, భారీ నియామకాలపై ప్రత్యేక దృష్టి**

**దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ ఆర్టీసీ: మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 1: తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రవాణా శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సాధించిన ప్రగతిని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇప్పటి వరకు 347.36 కోట్ల మంది మహిళలు ఈ పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించి రూ.12,167 కోట్ల మేర ఆర్థిక లాభం పొందినట్లు వెల్లడించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పథకం ఎంతో దోహదపడుతోందని, పలు సర్వేలు కూడా దీనిని నిర్ధారిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా 600 బస్సులకు మహిళలను యజమానులుగా చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. ప్రతి బస్సుకు నెలకు రూ.69,468 చొప్పున వాయిదా చెల్లిస్తూ మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నామని చెప్పారు. ఇందుకోసం నెలకు రూ.4 కోట్లకుపైగా చెల్లిస్తున్నామని, ఇప్పటి వరకు రూ.29.31 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. గతంలో 67 శాతంగా ఉన్న బస్సుల వినియోగం ప్రస్తుతం 89 శాతానికి చేరుకోవడం ఆర్టీసీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు.

ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని, అందులో 1,024 విద్యుత్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీ సేవల సమన్వయంతో చివరి మైలు వరకు ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. బస్ స్టేషన్ల ఆధునికీకరణ, కొత్త డిపోల ఏర్పాటు, విద్యుత్ వాహన విధానం అమలు, కొత్త మార్గాల ప్రారంభం వంటి చర్యలతో రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రెండు వేతన సవరణలు, ఐదు కరవు భత్యాలు అందించామని, ఎలాంటి పెండింగ్ బకాయిలు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు, విధుల నుంచి తొలగించబడిన 244 మంది ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా, ఇప్పటికే వెయ్యి మంది డ్రైవర్లు, 743 మంది శ్రామికుల నియామకాలు పూర్తయ్యాయని, మరో 1,500 మంది కండక్టర్ల నియామకానికి అనుమతి లభించిందన్నారు.

రోడ్డు భద్రత, సాంకేతిక సంస్కరణలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టామని మంత్రి పేర్కొన్నారు. వాహన, సారథి సేవలను ప్రవేశపెట్టడంతో పాటు స్క్రాప్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ పరీక్షలు, రహదారి భద్రత కార్యక్రమాలు, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించే పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. రవాణా శాఖలో ఖాళీల భర్తీ, అమలు విభాగాల బలోపేతం ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా ఎదుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు కొత్త మార్గాల్లో బస్సులను నడుపుతున్నామని, గ్రామీణ ప్రాంతాలకు కూడా రవాణా సౌకర్యాలు విస్తరిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు, అధికారుల సమిష్టి కృషితో ఆర్టీసీ మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

**తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు.. ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్**

వాషింగ్టన్,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ



నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

## రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

**విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి**

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు.

ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్చలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా-భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగునున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు.

## మదర్సా విస్తరణ కోసం దుర్మార్గం

### పాక్‌లో పురాతన హిందూ ఆలయం కూల్చివేత

లాహోర్,సెప్టెంబర్1: పాకిస్థాన్‌లో దారుణం జరిగింది. ఓ పురాతన హిందూ దేవాలయాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చేశారు. దేశ విభజన తరవాత ఎన్నో దేవాలయాలను కూల్చిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో పురాతన దేవాలయాన్ని కూల్చింది. మదరసా విస్తరణ కోసం 100 ఏళ్ల నాటి హిందూ దేవాలయాన్ని కూల్చేసిన ఘటన పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. న్యూస్ ఏజెన్సీ రిపోర్టు ప్రకారం.. లాహోర్‌కు దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న నరోవాల్ జిల్లాలోని 'సిరాజ్' అనే గ్రామంలో 100 ఏళ్లనాటి ఓ ఆలయం ఉంది. ఆ ఆలయం సుమారు 1,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. ఆలయం పక్కనే మదరసా ఉంది. నిషేధిత తీవ్రవాద ఇస్లామిక్ పార్టీ 'తెహ్రీక్-ఇ-లబ్బైక్ పాకిస్తాన్'కి చెందిన కొందరు వ్యక్తులు మదరసాను విస్తరించటం కోసం ఆగస్టు 21వ తేదీన ఆలయాన్ని కూల్చివేశారు. ఆలయ శిఖరానికి సంబంధించిన మెటల్ ఫిట్టింగులను, ఇటుకలను అక్కడి నుంచి తరలించారు. హక్కుల కార్యకర్తలు ఈ సంఘటనపై వెంటనే దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కూలగొట్టిన చోటే ఆలయాన్ని పునర్నిర్మించాలని స్థానిక నాయకులు, మైనారిటీ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. సంఘటనపై ప్రభుత్వ వాదనలు భిన్నంగా ఉన్నాయి. 100 నుంచి 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆ గుడి భారీ వర్షాల కారణంగా కూలిపోయిందని ప్రభుత్వం అంటోంది. ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్ అధికారి మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రభుత్వ రికార్డుల్లో గుడికి పేరు లేదు. అది చాలా పురాతనమైన గుడి. 100 నుంచి 125 సంవత్సరాల పాతది. భారీ వర్షాల కారణంగా గుడి కూలిపోయింది. ఆ భూమిని ఎవ్వరికీ లీజుకు ఇవ్వలేదు. గుడిని పునర్నిర్మించే బాధ్యత మా అధికారులు తీసుకుంటారని తెలిపారు.





# పేదల ఆత్మగౌరవానికి ఎన్‌టీఆర్ భరోసా!

**అర్హుల ఇంటికే నేరుగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు**

**జిల్లాలో 2,24,235 మంది లబ్ధిదారులకు రూ. 97.16 కోట్లు**

**పెన్షన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

పేదలకు సామాజిక భద్రత కల్పిస్తూ ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మంగళవారం విజయవాడ అర్బన్ పరిధిలోని 27వ వార్డు బావాజీపేటలో అధికారులతో కలిసి కలెక్టర్ లక్ష్మీశ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా జిల్లాలో 2,24,235 మంది లబ్ధిదారులకు రూ. 97.16 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు వారి ఇంటి వద్దకే నేరుగా అందించడం ద్వారా ప్రభుత్వం సామాజిక భద్రతకు భరోసా కల్పిస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల సామాజిక భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏ లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందో ఆ లక్ష్యం నెరవేరేలా లబ్ధిదారులు వాటిని ఉపయోగించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ డా. డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ నియమాలను పాటించాలి

**సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు**

విజయనగరం, సెప్టెంబర్ 1: కొత్తగా తెలుగుదేశం పార్టీలో చేరిన వారు పార్టీ నియమాలను పాటించాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు సూచించారు. మంగళవారం విజయనగరం మంత్రి క్యాంప్ కార్యాలయం నందు గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ మండలం పొల్లంకి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, మాజీ వార్డు మెంబర్లు రావాడ అప్పన్న, వగల దేవుడు మరియు 20 కుటుంబాల వారు వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలో చేరారు. కొండలరావు తెలుగుదేశం పార్టీ కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో చేరిన వారు సీనియర్ నాయకుల సమన్వయంతో ముందుకు సాగాలని, పార్టీ నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జిలు అల్లు విజయకుమార్, రండి చిన రామానాయుడు, బూడి అప్పలనాయుడు, తాటిపూడి ప్రాజెక్టు చైర్మన్ కళ్ళెంపూడి జగన్నాథం, రంది రాము నాయుడు, దేవుడు బాబు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## క్లెయిమ్స్, అభ్యంతరముల స్వీకరణ తేదీ ఈ నెల 10 వరకు

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పక్షాల అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ జారీ చేసింది. ఈ షెడ్యూల్ మేరకు గతంలో ప్రకటించిన క్లెయిమ్స్, అభ్యంతరముల స్వీకరణ తేదీని ఈ నెల 10 వరకు పొడిగించడమైనది. ఈ ప్రక్రియలో వచ్చిన క్లెయిమ్స్ మరియు అభ్యంతరముల పరిష్కారం, నోటీసుల ప్రక్రియకు గతములో ప్రకటించిన షెడ్యూల్ నందు తుది తేదీ 28.09.2026గా ఉండగా ప్రస్తుతం సవరించిన షెడ్యూల్ మేరకు ది. 05.10.2026 తేదీకి పొడిగించడమైనది. అదే విధముగా గతములో ప్రకటించిన ఓటరు తుది జాబితా ప్రచురణ ది. 03.10.2026 గా ఉండగా ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఓటరు జాబితా తుది ప్రచురణ తేదీని ది.09.10.2026 వ తేదీకి మార్చబడినది. కావున ఎన్నికల సంఘము ప్రకటించిన ఈ షెడ్యూల్ ని అర్హులు అయిన వారు సద్వినియోగం చేసుకుని ది.10.09.2026 తేదీ వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరముల దరఖాస్తులు సమీపములోని పోలింగ్ కేంద్రముల వద్ద దీూా లకు గానీ, సహాయక ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయముల వద్ద గానీ లేదా ఎన్నికల నమోదు అధికారుల కార్యాలయముల వద్ద గానీ సమర్పించిన యెడల వాటిపై విచారణ నిర్వహించి నిబంధనల మేరకు ది. 09.10.2026 తేదీన ప్రకటించు తుది ఓటరు జాబితాలో చేర్చబడునని, ఈ అవకాశమును అర్హులైన వారు సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి.లక్ష్మీశ కోరారు.

# ఎయిర్ మార్షల్ సందీప్ థరేజా బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1

ఎయిర్ మార్షల్ సందీప్ థరేజా సాయుధ దళాల వైద్య సేవల 47వ మహా సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు. దేశ రక్షణ దళాలకు వైద్య సేవలను అందించే అత్యున్నత పదవిగా భావించే ఈ బాధ్యతలను ఆయన చేపట్టారు. మహా సంచాలకుడిగా ఎయిర్ మార్షల్ సందీప్ థరేజా భారత సైన్యం, నౌకాదళం, వాయుసేనలకు సమగ్ర వైద్య సేవలు అందేలా పర్యవేక్షించనున్నారు. రక్షణ దళాల వైద్య వ్యవస్థ బలోపేతం, సైనికులకు ఆధునిక వైద్య సదుపాయాల కల్పన, ఆరోగ్య సేవల సమన్వయం వంటి కీలక అంశాలపై ఆయన దృష్టి సారించనున్నారు. బాధ్యతలు స్వీకరించే ముందు ఎయిర్ మార్షల్ సందీప్ థరేజా న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక స్థూపాన్ని సందర్శించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. రక్షణ వైద్య రంగంలో విశేష అనుభవం కలిగిన సందీప్ థరేజా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. వైద్య సేవల నిర్వహణ, సైనిక ఆసుపత్రుల అభివృద్ధి, అత్యవసర వైద్య వ్యవస్థల బలోపేతం లో ఆయనకు విస్తృత అనుభవం ఉంది. సాయు ధ దళాల వైద్య సేవల మహా సంచాలకుడిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో రక్షణ దళాలకు మరింత సమర్థవంతమైన, ఆధునిక వైద్య సేవలు అందే అవకాశాలు మెరుగుపడనున్నాయని అధికారులు పేర్కొంటు న్నారు. దేశ రక్షణలో సైనికుల ఆరోగ్యం కీలకమైన అంశమని, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు సాయుధ దళాల వైద్య విభాగం నిరంతరం కృషి చేస్తోందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఎయిర్ మార్షల్ సందీప్ థరేజా నాయకత్వంలో ఈ సేవలు మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.

## బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై 'అబద్ధాలువాస్తవాలు' ఫొటో ఎగ్జిబిషన్

**గాంధీ భవన్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రదర్శన**

**ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే లక్ష్యం: మెట్టు సాయికుమార్**

హైదరాబాద్, సెప్టెంబర్ 1



బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజల ముందుంచేందుకు గాంధీ భవన్‌లో 'అబద్ధాలు--వాస్తవాలు' పేరుతో ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. తెలంగాణ మత్స్య సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఫొటోలు, పోస్టర్ల రూపంలో ప్రజలకు వివరించారు. 'దశాబ్దపు దగా' వర్సెస్ 'ప్రజా పాలన' అనే ప్రధాన అంశంతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో గత ప్రభుత్వ హామీల అమలు పరిస్థితిని ఒకవైపు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను మరోవైపు ప్రదర్శించారు. ప్రజలు స్వయంగా పరిశీలించి పాలనల మధ్య తేడాను అర్థం చేసుకునేలా ప్రత్యేకంగా ఎగ్జిబిషన్‌ను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు నిజాలు తెలియజేయడమే ఈ ప్రదర్శన ఉద్దేశమని అన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చే విషయంలో గత ప్రభుత్వ వైఫల్యాలను ఎగ్జిబిషన్‌లో ప్రస్తావించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ ముందుకు సాగుతోందని వివరించారు. పేదల గృహావసరాల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఉచిత కేజీ టు పీజీ విద్య హామీ అమలు కాలేదని విమర్శించిన సాయికుమార్, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగిస్తున్నాయని మెట్టు సాయికుమార్ తెలిపారు. గత పాలనలోని హామీలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల మధ్య తేడాను ప్రజలకు తెలియజేయడానికే ఈ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యం

**స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానమే ప్రభుత్వ లక్ష్యం**

**ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం**

**ఎస్ఐసిసిఐ 116వ వార్షిక సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి, సెప్టెంబర్ 1 : ఎంఎస్ఎంఈల పటిష్టతతోనే 2047 లక్ష్యాలు సాధ్యమవుతాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం దక్షిణ భారత చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ూ×జజ×) 116వ వార్షిక సర్వసభ్య సమావేశం (ూా+వీ) చెన్నైలోని హోటల్ లీలా ప్యాలెస్‌లో ఘనంగా జరిగింది. దక్షిణ భారతదేశంలో వ్యాపార, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ఈ సమావేశంలో చర్చలు జరిపారు.

సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కొండపల్లి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలను, యువతను ప్రోత్సహించడం ద్వారానే సమగ్ర ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకు ప్రభుత్వం, పారిశ్రామిక వర్గాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని మంత్రి పిలుపుఇచ్చారు. పారిశ్రామిక పార్కులు, ఉమ్మడి వసతులు, ఆర్థికసాయంతో ఏపీలో ఎంఎస్ఎంఈలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇండియా-ఈయూ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఖీూా), ఎన్ఆర్ఐ వర్గాల సహకారంతో స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

ఎస్ఐసిసిఐ అధ్యక్షుడు అరుణ్ అలగప్పన్ మాట్లాడుతూ 2047 నాటి భారత వికాస లక్ష్యాలు చిన్న తరహా పరిశ్రమల (మీవీజు) ప్రగతిపైనే ఆధారపడి ఉన్నాయని.. తమిళనాడు సాధించాలనుకుంటున్న ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రప్రదేశ్ నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర ఏ2047' లక్ష్యాల సాధనలో చిన్న పరిశ్రమలే కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మద్రాస్ యూనివర్సిటీ, అన్నామలై యూనివర్సిటీ, లయోలా ఇన్‌స్టిట్యూట్, త్యాగరాజ కాలేజ్, భారతిదాసన్ యూనివర్సిటీ విద్యార్థులకు మంత్రి పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమం ఎస్ఐసిసిఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వి.ఎన్. శివ శంకర్ ధన్యవాద సమర్పణతో ముగిసింది.



# జలమే జీవం.. నీటిని గౌరవించడం మన సంస్కృతి

**భావితరాలకు జల సంస్కృతిని అందించాలి: లివట్టే జానయ్య యాదవ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

జలం మనిషికి జీవనాధారమని, నీరు లేకుండా మానవ మనుగడను ఊహించలేమని సామాజిక ఉద్యమ నాయకుడు లివట్టే జానయ్య యాదవ్‌లి అన్నారు. అందుకే భారతీయ సంస్కృతిలో తరతరాలుగా జలాన్ని పవిత్రంగా భావించి పూజించే సంప్రదాయం కొనసాగుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ గంగ తెప్పోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గంగ తెప్పోత్సవ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ జీవనంతో పాటు పశుపక్ష్యాదులు, వ్యవసాయం, ప్రకృతి సమతుల్యతకు నీరే ప్రధాన ఆధారమని చెప్పారు. నీటి ప్రాధాన్యతను గుర్తించిన మన పూర్వీకులు నదులు, చెరువులు, కుంటలు, ఇతర జలవనరులను గౌరవించే సంప్రదాయాన్ని ఏర్పరిచారని తెలిపారు. మన తాతలు, తండ్రులు జలాన్ని కేవలం అవసరంగా కాకుండా ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపదగా భావించారని జానయ్య యాదవ్ పేర్కొన్నారు. వారు అందించిన ఈ గొప్ప జీవన సంస్కృతిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జలవనరులను కాపాడుకోవడం, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం కూడా జలాన్ని గౌరవించడంలో భాగమేనని చెప్పారు. గంగ తెప్పోత్సవం వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేయడంతో పాటు జల సంరక్షణపై సమాజంలో అవగాహన పెంచేందుకు దోహదపడతాయని అన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో గంగ తెప్పోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్లూ ఇండియా ప్రెసిడెంట్ బొంగు ప్రసాద్ గౌడ్, నీరజ గౌడ్, వాసుకే యాదవ్, మేకల కృష్ణ యాదవ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు..



# జల సంరక్షణతోనే భవిష్యత్‌కు భరోసా

**'తెలంగాణ జలసిరి' పోస్టర్ ఆవిష్కరణ.. గ్రామంలో అవగాహన ర్యాలీ**

**చిలుకూరు, సెప్టెంబర్ 1:**

నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో శిరీష పిలుపునిచ్చారు. 'తెలంగాణ జలసిరి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిలుకూరు గ్రామంలో జలసిరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రైతులు, మహిళలు, గ్రామ ప్రజలతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ఆవశ్యకత, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరత, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షపు నీరు వృథాగా పోకుండా ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు ఏర్పాటు చేయడంతో పాటు వాటర్ రీఛార్జ్ పద్ధతులను అనుసరించాలని రైతులకు వివరించారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్‌లో తాగునీరు, సాగునీటి కొరతను కొంతమేర అధిగమించవచ్చని అధికారులు పేర్కొన్నారు. జల సంరక్షణను ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్య ఉద్యమంగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, ఏపీఓ నిర్మల, పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్, వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో 'పెన్షన్ విద్రోహ దినం'**

**కొనసాగిస్తాం: ఉద్యోగ సంఘాల నేతలు**

**సూర్యాపేట, సెప్టెంబర్ 1 :**

నూతన పెన్షన్ విధానం (సీపీఎస్)ను పూర్తిగా రద్దు చేసి, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీజీఈ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దున్న శ్యామ్, జనరల్ సెక్రటరీ భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు పిలుపు మేరకు మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో 'పెన్షన్ విద్రోహ దినం' నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతకు పాత పెన్షన్ విధానమే భరోసా కల్పిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితాంతం ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగుల పదవీ విరమణ అనంతర భవిష్యత్తును మార్కెట్ ఆధారిత పెన్షన్ విధానాలకు వదిలేయడం సమంజసం కాదన్నారు. ఉద్యోగులకు నిర్దిష్టమైన, భద్రమైన పెన్షన్ అందించే పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని కోరారు. నూతన పెన్షన్ విధానం కారణంగా ఉద్యోగుల పదవీ విరమణ అనంతర ఆర్థిక భద్రతపై నిశ్చితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి, 2024 సెప్టెంబర్ 1 తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా నియమితులైన వారందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. న్యాయమైన పెన్షన్ హక్కు సాధించే వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీజీఈ జేఏసీ నాయకులు మట్టపల్లి రాధాకృష్ణ, ఎస్. రవికుమార్, నాయిని ఆకాష్ వర్మ, కోడిరెక్క నాగేందర్, పి. కరుణాకర్ రెడ్డి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె యాదగిరి, మాడిపడగ సైదులు, డాక్టర్ బట్టు గోపి, దర్శనం మల్లేష్, వెంకటరామ రెడ్డి, లక్ష్మయ్య, శ్యామ్ ప్రసాద్, అల్లి సతీష్, భూపతి వెంకటయ్య, నాందీపాటి రవి, కోడి మురళి, బాదే లింగయ్యతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

**హక్కుల పరిరక్షణకు ఏకతాటిపైకి రావాలి**

**బీఫామ్‌ల కోసం ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు: వట్టే జానయ్య యాదవ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**



బీసీలందరూ తమ హక్కుల పరిరక్షణ కోసం ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా పోరాడాలని, లేనిపక్షంలో వారి రాజకీయ, సామాజిక అస్తిత్వమే ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకుడు, టీఆర్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో మన ఆలోచన సమితి, తెలంగాణ స్వాభిమాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయమ్మ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీలు కులాలు, సంఘాల పేరుతో చెల్లాచెదురుగా ఉండటం వల్ల రాజకీయంగా ఇప్పటికే ఎంతో నష్టపోయారని జానయ్య యాదవ్ పేర్కొన్నారు. ఇప్పటికైనా బీసీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత బీసీ సంఘాలు, సామాజిక ఉద్యమ సంస్థలపై ఉందన్నారు. రాజకీయ పార్టీల నుంచి బీఫామ్‌ల కోసం బీసీలు తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టుకోవద్దని సూచించారు. కులాల వారీగా సంఘటితమవుతూనే, అంతిమంగా బీసీలుగా ఐక్యమై రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. గడిచిన 80 ఏళ్లుగా బీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబాటుతనాన్ని అనుభవిస్తూ రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీసీల్లో రాజకీయ చైతన్యం పెరుగుతోందని, ఈ చైతన్యాన్ని సంఘటిత ఉద్యమంగా మార్చి రాజ్యాధికార పోరాటంలో ప్రతి బీసీని భాగస్వామిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. "బీసీల ఐక్యత ద్వారానే రాజ్యాధికారం సాధ్యమవుతుంది. అందుకోసం జాయింట్ యాక్షన్ కమిటీలను ఏర్పాటు చేసుకుని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలి" అని జానయ్య యాదవ్ పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీల రాజకీయ శక్తిని చాటే విధంగా సమైక్య కార్యాచరణతో ముందుకు సాగాలని కోరారు. సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జికి స్వాతంత్ర్య సమరయోధురాలు సంగం లక్ష్మీబాయమ్మ పేరు పెట్టడం ద్వారా ఆమె సేవలకు సముచిత గౌరవం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లూ ఇండియా అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్, నీరజ గౌడ్, వాసుకే యాదవ్, మేకల కృష్ణ యాదవ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించాలి

**బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నేతల మండిపాటు**

**కేసులతో రాహుల్ గాంధీ గొంతును అణచివేయలేరని స్పష్టం**

**సూర్యాపేట, సెప్టెంబర్ 1 :**

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై నమోదు చేసిన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై కేసు నమోదును నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, దళితుల ఆత్మగౌరవం వంటి అంశాలపై ప్రశ్నిస్తున్నందుకే రాహుల్ గాంధీని కేసులతో వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేయడం బీజేపీ మార్కు ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. కేసులు నమోదు చేయడం ద్వారా రాహుల్ గాంధీ గొంతును అణచివేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులను కేసులతో భయపెట్టే విధానాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఘనంగా కేసీ గుప్తా 107వ జయంతి వేడుకలు

**స్వాతంత్ర్య సమరయోధుడిగా, సేవా ఉద్యమ స్ఫూర్తిప్రదాతగా కేసీ గుప్తా సేవలు చిరస్మరణీయం**

**సూర్యాపేట, సెప్టెంబర్ 1 :**

స్వాతంత్ర్య సమరయోధుడు, వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు, ఆర్యవైశ్యుల ముద్దుబిడ్డ కల్వకుంట్ల చంద్రసేన్ గుప్తా (కేసీ గుప్తా) 107వ జయంతి వేడుకలను మంగళవారం సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కేసీ గుప్తా చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ నాయకుడు మొరిశెట్టి లక్షాది కేసీ గుప్తా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో కేసీ గుప్తా చురుకైన పాత్ర పోషించారని, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని తన దేశభక్తిని చాటుకున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా సమాజ సేవకు సంస్థాగత రూపం కల్పించిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సమాజం లో సేవాభావాన్ని పెంపొం దించాలనే సంకల్పంతో కేసీ గుప్తా కేవలం తొమ్మిది మంది సభ్యులతో వాసవి క్లబ్‌ను ప్రారంభించారని, చిన్నగా ప్రారంభమైన ఆ సేవా ఉద్యమం నేడు లక్షలాది మందిని ప్రభావితం చేసే స్థాయికి విస్తరించిందని తెలిపారు. సేవ, స్నేహం, సమాజ హితం అనే లక్ష్యాలతో ముందుకు సాగుతున్న వాసవి క్లబ్ ద్వారా పేదలు, చిరు వ్యాపారులు, అవసరంలో ఉన్న కుటుంబాలకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందుతున్నాయని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో దేశం కోసం పోరాడటంతో పాటు స్వాతంత్ర్యానంతరం సమాజ నిర్మాణంలోనూ కేసీ గుప్తా తన వంతు పాత్ర పోషించారని వక్తలు పేర్కొన్నారు. సామాజిక సేవ, పరస్పర సహకారం, సంఘటిత శక్తి ద్వారా బలహీన వర్గాలకు చేయూతనివ్వాలన్న ఆయన ఆశయాలు నేటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని అన్నారు. ఆయన చూపిన సేవా మార్గాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య సమాజం అభివృద్ధితో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగించడమే కేసీ గుప్తాకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయన జయంతిని కేవలం ఉత్సవంగా కాకుండా సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించే సందర్భంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బిక్కమల్ల కృష్ణ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, ఆర్యవైశ్య నాయకులు సింగరికొండ రవీందర్, కర్నాటి కిషన్, చల్లా లక్ష్మయ్య, కలకోట లక్ష్మయ్య, మీలా వంశీ, పోతుగంటి వెంకటేశ్వర్లు, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ఈగ దయాకర్ గుప్తా, రాచకొండ శ్రీనివాస్, తప్పి గాంధీ, పట్టణ మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి రమేష్, మిట్టపల్లి రమేష్, సుమన్ వెంకన్న, పబ్బతి వేణుమాధవ్, సోమ వెంకటేశ్వర్లు, సోమ ప్రవీణ్, శ్రీరంగం రాము, చల్లా సత్యనారాయణ, మంచాల శ్రీనివాస్ గుప్తా, వంగవీటి రమేష్, నూనె యుగంధర్, నవిలిపురి నరేందర్, ఉప్పలంచు కృష్ణ, చిత్తలూరి శ్రీధర్, ఇమ్మడి శ్రీనివాస్, ఓరుగంటి లావణ్య, ఓరుగంటి లక్ష్మి, కక్కిరేణి అనిత తదితరులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణతో కూడిన జీవనశైలితో లక్ష్యసాధన సుసాధ్యం

**వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**

**కరీంనగర్, సెప్టెంబర్ 1 :**

క్రమశిక్షణతో కూడిన దినచర్యను అలవాటు చేసుకొని, సమయపాలనతో నిరంతరం కృషి చేస్తే ఎంచుకున్న రంగంలో రాణించడంతో పాటు అనుకున్న లక్ష్యాలను సాధించడం సులభమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకుడు, రచయిత, కాలమిస్ట్, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్ ఆవరణలో లీడ్ ఇండియా, శాతవాహన లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణను అలవర్చుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందేలా వ్యక్తి త్వాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. సమయాన్ని సద్విని యోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా కృషి చేసే విద్యార్థులు తమ లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని పేర్కొన్నారు. ప్రతిరోజూ విధిగా మూడు నుంచి నాలుగు గంటలు చదివే అలవాటు చేసుకోవాలని, చిన్నతనంలో అలవ డిన మంచి పద్ధతులు జీవితాంతం వ్యక్తి ఎదుగు దలకు దోహదపడతాయని తెలిపారు. పుస్తకాలు జీవితంలో అత్యంత ఆత్మీయ నేస్తాలుగా మనతో నడుస్తాయని పేర్కొన్నారు. "పుస్తకాలు హస్తభూ షణాలే కాదు.. మస్తిష్క వికాసానికి నేస్తాలు" అని ఆయన అభివర్ణించారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి కలెక్టర్, డాక్టర్, ఇంజనీర్, పోలీస్ అధికారి, న్యాయవాది, ఉపాధ్యాయుడు, ఔత్సాహిక పారిశ్రామికవేత్త వంటి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్లూ బెల్స్ హైస్కూల్ చైర్మన్ మనోహర్ రెడ్డి, సునీత, పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు సుమారు 200 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.





# గద్వాల్ జిల్లాలో గణేష్ ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**గద్వాల్, సెప్టెంబర్ 1 :**

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాం తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచే యాలని జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదే శించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయిల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహ కులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన సూచనలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు విద్యుత్ శాఖ నుంచి భద్రతా ధ్రువీకరణ పత్రాలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల తరలింపు మార్గాల్లో విద్యుత్ తీగలు అడ్డంకిగా లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బీచుపల్లి, నది అగ్రహారంలోని కృష్ణానది నిమజ్జన ఘాట్ల వద్ద భారీ సంఖ్యలో భక్తులు, విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. క్రేన్లు, గజ ఈతగాళ్లు, లైటింగ్ సదుపాయాలు, భద్రతా బ్యారి కేడ్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జన మార్గా ల్లోని రహదారులను మరమ్మతు చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసు శాఖ అప్రమ త్తంగా వ్యవహరించాలని కలెక్టర్ అన్నారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత అధిక శబ్దాలతో మైకులు, డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆసు పత్రులు, విద్యాసంస్థల సమీప ప్రాంతాల్లో శబ్ద కాలు ష్యం లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు లని సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వినాయక ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపడు తున్నామని తెలిపారు. బీచుపల్లి నిమజ్జన ఘాట్‌కు ఇతర జిల్లాల నుంచి కూడా విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందు న ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాన రహదారులపై సూచిక బోర్డులు, హెచ్చరిక ఫలకాలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డీసీపీ అనూరాధ ఆకస్మిక తనిఖీ





**సెప్టెంబర్ 1 :**

ఎల్‌బీ నగర్ డీసీపీ బి. అనూరాధ ఐపీఎస్ మంగళవారం నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితి, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమగ్రంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధిం చిన రికార్డులు, దస్త్రాలు, కేసుల నమోదు విధానం, దర్యాప్తు పురోగతి తదితర అంశాలను డీసీపీ క్షుణ్ణంగా పరిశీలిం చారు. కేసుల పరిష్కారంలో వేగం పెంచడంతో పాటు రికా ర్డుల నిర్వహణలో ఖచ్చిత త్వం పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన డీసీపీ, వారి సమస్యలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందు లను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది సంక్షేమానికి శాఖ ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆమె, క్రమశిక్షణ, సమర్థవంతమైన విధి నిర్వహణ, జవాబు దారీతనం పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచుతాయని తెలిపారు. ప్రతి పోలీసు సిబ్బంది ప్రజలతో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని డీసీపీ ఆదేశించారు. ఫిర్యా దుల పరిష్కారంలో జాప్యం లేకుండా స్పందిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిం చాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపర్చేందుకు ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని డీసీపీ అనూరాధ పేర్కొన్నారు. ప్రజా భద్రత, శాంతిభద్ర తల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ సమ న్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు.

# సెప్టెంబర్ 2 నుంచి ఎల్‌బీనగర్‌లో బీఆర్ఎస్ 'పోరుబాట'



**సెప్టెంబర్ 1 :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన వైఫ ల్యాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో జరిగిన ఆలస్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 7 వరకు ఎల్‌బీనగర్ నియోజక వర్గంలో "బీఆర్ఎస్ పోరుబాట" కార్యక్ర మాలు నిర్వహిం చనున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధా న ఉద్దేశమని పేర్కొన్నారు. గడ్డి అన్నా రం డివిజన్ పరిధి లోని ఒక ప్రైవేట్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్ రెడ్డి, రానున్న కార్యక్ర మాల కార్యాచ రణను వివరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని కాంగ్రె స్ చెప్పి, ఇప్పటికీ వాటిలో అనేకం అమ లు కాలేద ని ఆరోపించారు. ఈ అంశాలను ప్రజాక్షేత్రంలో ఎండగ డతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఆర్థిక సాయం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు, రైతుబంధు, విద్యార్థినులకు స్కూటీలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కౌలు రైతులకు ఆర్థిక సాయం, విద్యా భరోసా కార్డు వంటి హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు సుధీర్ రెడ్డి తెలిపారు. యువత, రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సెప్టెంబర్ 2న ఎల్‌బీనగర్ చౌరస్తాలో "ప్రజల పోరుబాట" పేరుతో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 3న నాగోల్ డివిజన్‌లో 22-ఏ భూముల సమస్యపై నిరసన కార్యక్ర మం, సెప్టెంబర్ 4న మహిళలకు ఇచ్చిన హామీల అమలు పై వంటావార్పు కార్యక్రమం చేపడతామని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం గొంతెత్తాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువత సమస్యలపై సమావేశం నిర్వహించి ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ అమలును డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 6న ఆటో కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 7న "ప్రజావాణి పోరుబాట"లో భాగంగా హయత్‌నగర్, ఉప్పల్, సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించ నున్నట్లు సుధీర్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కొత్తగూడెం, సెప్టెంబర్ 1 :**

రామవరం ప్రాంతంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల కు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, పాఠశాల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. పాఠశాల భవనాలు, వంటశాల, భోజనశాల, నిల్వ గది, శుద్ధి చేసిన తాగునీటి కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థి తులను తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా విద్యార్థు లకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిం చిన కలెక్టర్, నిల్వ గదిలో కుళ్లిపోయిన బెల్లం ఉ ండటాన్ని గుర్తించారు. దీనిపై క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆహార పదార్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆహార పదార్థాల నిల్వ, వినియోగం, పరిశుభ్రత విషయంలో నిర్దిష్ట ప్రమాణాలు పాటించా లని సూచించారు. పాఠశాల సిబ్బంది తమ బాధ్యతల ను సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థుల సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా చూడాలని చెప్పారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భద్రతా గది, అంతర్గత రహదారుల పరిస్థితిని పరిశీలించి, ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





# భూ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: కలెక్టర్

**జనగామ, సెప్టెంబర్ 1 :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూ సర్వే కార్యక్రమం అమలులో జనగామ జిల్లా ముందంజలో ఉందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఇదే వేగంతో మరింత సమర్థవంతంగా, నాణ్యతతో భూ సర్వే పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో సమావేశమైన కలెక్టర్, జిల్లాలో భూ సర్వే పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన భూ సర్వే లక్ష్యాన్ని నవంబర్ 30వ తేదీ నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి దశను ప్రణాళికాబద్ధంగా అమలు చేయడంతో పాటు పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ పడవద్దని సూచించారు. భూ సర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు జిల్లాకు అదనంగా ఐదు రోవర్ పరికరాలను కొనుగోలు చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం రోజుకు 20 నుంచి 25 ఎకరాల వరకు సర్వే నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. భూ సర్వేలో లైసెన్స్ సర్వేయర్ల సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని, ప్రతి గ్రామానికి ఇద్దరు చొప్పున సర్వేయర్లను కేటాయించాలని ఆదేశించారు. విధులకు హాజరుకాని లేదా పనులు చేపట్టని సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి మొత్తం సర్వే ప్రక్రియను 12 బృందాలుగా విభజించి సమన్వయంతో నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రాధాన్య సర్వే పనులను 20 రోజుల్లో పూర్తి చేసేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో ఖచ్చితత్వం, పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. జిల్లాలోని భూముల రికార్డులు స్పష్టంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోని ఆరు మండలాల్లో ఉన్న 123 ఎకరాల భూమికి సంబంధించిన మ్యాప్‌ను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ భూమిని 72 చదరపు గజాల ప్లాట్లుగా విభజించే ప్రక్రియను నిబంధనల ప్రకారం చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ మన్యంకొండ, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ మాధవీలత, సర్వేయర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 :**

ఆగస్టు-2026 నెలకు సంబంధించిన స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమంపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమం పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించే దిశగా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేక పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఉ త్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఆంగ్లంలో మాట్లాడే సామర్థ్యం, ఉచ్చారణ, ప్రదర్శన నైపుణ్యాలను పరీక్షించే విధంగా పోటీలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పోటీల అనంతరం కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషపై పట్టు సాధించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. విజేతలతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరింత కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమం విజయవంతం కావడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ఆంగ్లంలో సమర్థంగా మాట్లాడే స్థాయికి చేరుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అకడమిక్ కోఆర్డినేటర్ అజయ్, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేపడుతున్న కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు.

# తెలంగాణ జలసిరి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 1 :**

గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద జిల్లాకు నిర్దేశించిన అన్ని పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాల ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో తెలంగాణ జలసిరి కార్యక్రమం పురోగతిపై సంబంధిత అధికారు లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో చేపట్టా ల్సిన పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతల నిర్మాణ లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఇంకా ప్రారంభం కాని పనులు, నిర్మాణ దశలో ఉన్న పనుల వివరాలను అధికారు లను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలకు అనుగుణంగా పనులు సాగకపోవ డంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడు తూ, విబీజీ రాంజీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచడమే తెలంగాణ జలసిరి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతలు నిర్మించాలని సూచించారు. పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు, రైతులను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తూ ప్రతి గ్రామంలో అవసరమైన ప్రాంతాల ను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, రైతుల పొలాల్లో పంట కుంటలు, బోర్‌వెల్స్ వద్ద రీచార్జ్ గుంతలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. అవసరమైన పరిపాలనా అనుమతు లను వెంటనే జారీ చేసి నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. రైతుల సహకా రంతో పంట కుంటల తవ్వకం పనులను వేగ వంతం చేయాలని, గ్రామాల వారీగా నిర్దేశిం చిన లక్ష్యాలను పూర్తి చేసేలా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి మండలానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించి, వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు తెలంగాణ జలసిరి కార్యక్రమం ఎంతో కీలకమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత పెరిగేలా అన్ని పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, జిల్లా పంచాయతీ అధికారి శ్రీమల, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో కీలక ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి జారీ చేసిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ సంక్షేమ పథకాల కొనసాగింపునకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ ఈ పథకాల లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు.

## భారత వైమానిక దళంలో చరిత్ర సృష్టించిన ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ

**న్యూఢిల్లీ, 1 :**

భారత వైమానిక దళ చరిత్రలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ భారత రక్షణ దళాల్లో వైద్య విభాగానికి చెందని మహిళా అధికారుల్లో ఎయిర్ వైస్ మార్షల్ హోదా పొందిన తొలి అధికారిగా చరిత్ర సృష్టించారు. సెప్టెంబర్ 1న ఆమె వైమానిక దళ ప్రధాన కార్యాలయంలో విద్యా విభాగ సహాయ ప్రధాన అధికారి బాధ్యత లను స్వీకరించారు. 1994 జూన్ 18న భారత వైమానిక దళ విద్యా విభాగంలో అధికారిగా చేరిన శక్తి శర్మ మూడు దశాబ్దా లకు పైగా విశిష్ట సేవలు అందిం చారు. శిక్షణ కేంద్రాలు, క్షేత్ర స్థాయి కేంద్రాలు, కమాండ్ ప్రధా న కార్యాలయాలు, వైమానిక దళ ప్రధాన కార్యాలయం వంటి పలు కీలక విభాగాల్లో పనిచేస్తూ విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్నా రు. ఆమె సేవలు వైమానిక దళ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాయి. విద్యా, వ్యూహాత్మక రక్షణ రంగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంలో కూడా శక్తి శర్మ ప్రత్యేక కృషి చేశారు. భారత సాంకేతిక విద్యాసంస్థ కాన్పూర్, పుణే విశ్వవిద్యాలయాల్లో వైమానిక దళ అత్యుత్తమ అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు ఆమె నాయకత్వం వహించారు.



# జిల్లా స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ సమావేశం



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 :**

జిల్లా స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా పోలీసు అధికారి అఖిల్ మహాజన్ సంయుక్తంగా అధ్యక్షత వహించి వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమావేశంలో అధికారులు వివరించారు. వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనుల స్థితిగతులు, ప్రజలకు అందుతున్న సేవలు, ప్రభుత్వ లక్ష్యాల అమలు అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించా రు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదా రులకు సకాలంలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించాలని సమావేశంలో అధికారులు, కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచిం చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రూ, ఎస్. రాజేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, ఎస్సీ సంక్షేమ అధికారి సునీతకుమారి, ఈడీ మనోహర్, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొ న్నారు.

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టులో భారీ ఊరట

**సెప్టెంబర్ 1 :**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో కీలక ఊరట లభించింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. ఈ వ్యవహారానికి సంబంధించిన తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రంగనాథ్ కొనసాగింపుపై నెలకొన్న అనిశ్చితికి తాత్కాలికంగా తెరపడింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2 పరిధిలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యలను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది.



**ఈ పిటిషన్ విచారణ సందర్భంగా హైడ్రా అధికారుల తీరుపై కోర్టులో విస్తృత చర్చ జరిగింది. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి, కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధ పాలనకు ముప్పుగా మారతారని వ్యాఖ్యానించారు. బాధ్యతా యుతమైన పదవుల్లో ఉన్న అధికారులు న్యాయస్థా నాల ఆదేశాలను గౌరవించా లని, లేకపోతే ప్రజా స్వామ్య వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సంద ర్భంగా హైడ్రా కమిష నర్ ఏవీ రంగనాథ్ వ్యవహారాన్ని కూడా ప్రస్తావించారు.**

గత ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఏవీ రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ కేసులు నమోదయ్యాయని సింగిల్ జడ్జి పేర్కొన్నారు. ఈ పరిస్థితిని అసాధారణంగా అభివర్ణిస్తూ, ఆయన హైడ్రా కమిషనర్‌గా కొనసాగడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. అయితే సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఏవీ రంగనాథ్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలు, కోర్టు చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించింది. విచారణ అనంతరం సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ రద్దు చేసింది. దీంతో ఏవీ రంగనాథ్ హైడ్రా కమిషనర్‌గా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. అయితే అసలు పిటిషన్‌కు సంబంధించిన విచారణ ఇంకా కొనసాగనున్న నేపథ్యంలో కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పు రాష్ట్ర పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.




## రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

తెలంగాణ కోసం వీరోచితంగా పోరాడి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖ ర్ రావుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రం గా ఖండిస్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యద ర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపా రు. రాజకీయ విభేదాలు ఉండవచ్చని, అయితే ప్రజా జీవితంలో ఉన్న నాయకుల గురించి మాట్లాడేటప్పుడు హుందాతనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి అనుచితమైన, అభ్యంతర కరమైన భాష ఉపయోగించడం బాధాకర మని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన వ్యక్తిపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి: హరీష్ రావు

**కళాశాలల యాజమాన్యాల వినతిపత్రం స్వీకరించిన మాజీ మంత్రి**



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 :**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను నెలల తరబడి విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు విమర్శించారు. ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అంటూ గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయడంలో విఫలమవడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ ఁ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత రెండున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో రాష్ట్రంలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హరీష్ రావు పేర్కొన్నారు. అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బందికి నెలల తరబడి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ ఫీజులు, ఇతర నిర్వహణ ఖర్చులను భరించలేక యాజమాన్యాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఒకప్పుడు రాష్ట్రంలో సుమారు 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ప్రస్తుతం దాదాపు 650కి పడిపో యిందని హరీష్ రావు ఆరోపించారు. ఇప్పటికే సుమారు 310 కళాశాలలు తగ్గిపోయా యని, ఇదే పరిస్థితి కొనసాగితే మరిన్ని విద్యాసంస్థ లు మూతపడే ప్రమా దం ఉందన్నారు. దీనివల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పట్ట ణాలు, మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాల లు పరిమితంగా ఉన్నందున ప్రైవేట్ కళాశాలలే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందించే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఒక కళాశాల మూతపడటం అంటే వందలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్య దూర మవడమేనని అన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థుల కు ఫీజు రీయింబర్స్‌మెంట్ కీలక ఆధార మని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పుడు రూ. 2,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నప్పటికీ వాటిని చెల్లించి పథకాన్ని కొనసాగించామని హరీష్ రావు తెలిపారు. కేసీఆర్ హయాంలో పెద్ద నోట్ల రద్దు, కరోనా వంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేయలేదన్నారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ బకాయిలతో కలిపి సుమారు రూ. 19,500 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు.



# నిర్మాతగా నిత్యామేనన్

తెలుగులో 'భీమ్లా నాయక్' సినిమాలో చివరగా కనిపించిన నిత్యామేనన్.. ప్రస్తుతం తమిళ, మలయాళ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. 50కి పైగా మూవీస్ చేసిన ఈమె ఇప్పుడు ఓ శుభవార్త చెప్పేసింది. నిర్మాతగా మారినట్లు వెల్లడించింది. హీరోయిన్లు.. నిర్మాతలుగా మారడం కొత్తేమీ కాదు. అప్పట్లోనే మహానటి సావిత్రి లాంటి వాళ్లు తమ అభిరుచికి తగ్గ మూవీస్ చేశారు. ప్రస్తుతం అగ్రనటిగా ఉన్న నయనతార కూడా చిత్ర నిర్మాణం చేపట్టి వరసగా చిత్రాలు నిర్మిస్తున్నారు. ఇప్పుడు ఈ లిస్టులోకి నిత్యామేనన్ చేరింది. కేయూరి ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నిర్మాణ సంస్థ ప్రారంభించి తొలి ప్రయత్నంగా లియో విజన్ సంస్థతో కలిసి చిత్రాన్ని నిర్మించడానికి రెడీ అయింది. ప్రముఖ దర్శకుడు విక్రమ్ కుమార్ ఈ చిత్రానికే క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. నిర్మాతగా వ్యవహరిస్తున్న నిత్యామేనన్ ఇందులో హీరోయిన్‌గానూ చేస్తోంది. డీకే కథ ,దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఫాంటసీ విత్ డార్క్ కామెడీ నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇతర నటీనటులు, టైటిల్ లాంటి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు.

# మమితా బైజు హ్యాట్రిక్

మలయాళ బ్యూటీ మమితా బైజుకు మహర్దశ పట్టినట్టు ఉంది. ఆమె పట్టిందల్లా బంగారమే అన్నట్లు అనిపిస్తోంది. అందుకు సజీవ సాక్ష్యం ఇప్పుడు రిలీజైన సినిమాలే. ఇటీవల ఆమె నటించిన మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద అరుదైన రికార్డ్ క్రియేట్ చేశాయి. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఈ సినిమాలు రిలీజ్ కాగా.. ఒక్కొక్కటి రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించాయి. దీంతో నెల రోజుల్లోనే మూడు సినిమాలు రూ.200 కోట్లు సాధించిన హీరోయిన్‌గా మమితా బైజు రికార్డ్ సృష్టించింది. జూలై 23న ఆమె నటించిన జన నాయగన్ బాక్సాఫీస్ వద్ద సందడి చేసింది. ఈ చిత్రంలో దళపతి విజయ్ హీరోగా నటించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆ తర్వాత సూర్య సరసన హీరోయిన్‌గా కనిపించింది. విశ్వనాథ్ అండ్ సన్స్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ చిత్రం రూ.240 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఇటీవల రిలీజైన మలయాళ మూవీ బెత్లెహమ్ ఫ్యామిలీ యూనిట్ సైతం బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లకు పైగా కలెక్షన్స్ వసూలు చేసింది. దీంతో హ్యాట్రిక్ కొట్టిన మమితా బైజు అరుదైన ఫీట్ సాధించింది. ఈ విషయంలో తొలి హీరోయిన్‌గా ఘనతను సొంతం చేసుకుంది.



# నవంబర్ 27న రష్మిక మైసా




రష్మిక మందన్న 'మైసా' నవంబర్ 27న థియేటర్లలోకి రానుంది. రిలీజ్ డేట్‌తో పాటు వచ్చిన పోస్టర్‌లో ఆమె చేతిలో ఈటె పట్టుకుని, రక్తం ఉన్న లుక్‌లో కనిపించింది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్ కూడా ఇదే రఫ్ టోన్‌లో ఉన్నాయి. సినిమా షూటింగ్ మాత్రం ఇంకా పూర్తి కాలేదు. రష్మిక గాయం నుంచి కోలుకుని మళ్లీ సెట్స్‌లోకి రావాల్సి ఉంది.

డేట్ ఫిక్స్ కావడంతో మిగిలిన పనికి ఇప్పుడు మూడు నెలల సమయం ఉంది. 'మైసా' షూటింగ్‌లోనే రష్మికకు హిప్ దగ్గర గాయమైంది. ఒక డాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె ఆమె ఇబ్బంది పడింది. ఆ తర్వాత కొంతకాలం పని ఆపి రెస్ట్ తీసుకుంది. ఇప్పుడు ఆరోగ్యం మెరుగుపడటంతో మళ్లీ షూటింగ్స్ మొదలుపెట్టేందుకు సిద్ధమవుతోంది. సినిమా కోసం ఇంకా కొంత భాగం మిగిలి ఉండటంతో, ఆమె మళ్ళీ వచ్చాక షెడ్యూల్‌ను ప్లాన్ చేయనున్నారు. ఈ సినిమాలో రష్మిక గోండ్ తెగకు చెందిన యువతిగా కనిపించనుంది. పాత్ర కోసం బ్యాంకాక్‌లో యాక్షన్ ట్రైనింగ్ తీసుకుంది. కేరళలో జరిగిన షెడ్యూల్‌లో స్టంట్స్ కూడా చేసింది. నీళ్లలో జరిగే ఒక టఫ్ సీక్వెన్స్‌ను ఇప్పటికే పూర్తి చేశారు. ఇప్పటివరకు రష్మిక చేసిన కమర్షియల్ సినిమాల కంటే ఇందులో ఎక్కువ హార్డ్ వర్క్ చేసినట్టు తెలుస్తోంది. అందుకే గాయం తర్వాత మిగిలిన యాక్షన్ సీన్స్ కోసం టైమ్ తీసుకుంటున్నారు. రష్మిక విజయ్ దేవరకొండతో నటించిన 'రణబాలి' అక్టోబర్ 16న వస్తోంది. దానికి 42 రోజుల తర్వాత 'మైసా' రిలీజ్ అవుతుంది. రెండు సినిమాల ప్రమోషన్స్ ఒకే సమయంలో దగ్గరపడే అవకాశం ఉంది. 'మైసా'లో మాత్రం కథ మొత్తం తన చుట్టూ తిరిగేలా ఇప్పటివరకు చూపించారు. నవంబర్ వరకు రష్మికకు షూటింగ్‌తో పాటు రెండు సినిమాల ప్రమోషన్స్ కూడా వరుసగా ఉండొచ్చు. డైరెక్టర్ రవీంద్ర పుల్లెకు 'మైసా' మొదటి సినిమా. మొదటి సినిమాతోనే ఐదు భాషల్లో విడుదలకు వెళ్లడం అంటే అతనిపై చాలా ప్రెజర్ ఉంటుంది. ఈశ్వరీరావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రల్లో ఉన్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటివరకు బయటకు వచ్చిన మెటీరియల్‌లో కథ కంటే రష్మిక పాత్ర, ఆమె లుక్, యాక్షన్ పార్ట్ లను ఎక్కువగా హైలెట్ చేశారు. ట్రైలర్ వచ్చిన తర్వాతే కథ ఎలా నడుస్తుందో తెలుస్తుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో నవంబర్ 27నే సినిమాను విడుదల చేయనున్నారు. డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ తీసుకోగా, ఆడియో హక్కులు టీ సిరీస్ దగ్గర ఉన్నాయి. థియేటర్ రిలీజ్‌కు ముందే సినిమా మంచి డిమాండ్ ను అందుకుంటోంది. ఇప్పుడు మేకర్స్ చేతిలో ఎక్కువ టైమ్ లేదు. రష్మిక షూటింగ్‌లోకి వచ్చిన తర్వాత మిగిలిన భాగం పూర్తయితే, అక్టోబర్ నుంచి రెగ్యులర్ ప్రమోషన్స్ స్టార్ట్ కావచ్చు.



# దేవరకొండ చిన్న కోడలు.. వైష్ణవి!?

యూట్యూబ్ వీడియోలు, షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ ప్రారంభించి 'బేబీ' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ హీరోయిన్‌గా మారిన వైష్ణవి చైతన్య గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో కలిసి నటించిన 'ఎపిక్' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమోషనల్ రాపిడ్ ఫైర్ సెషన్‌లో వైష్ణవి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సిద్ధు జొన్నలగడ్డను లవ్ చేస్తానని, ఆనంద్ దేవరకొండను పెళ్లి చేసుకుంటానని చెప్పి అందరికీ షాక్ ఇచ్చింది. 'ఎపిక్' సినిమా ప్రమోషన్లలో భాగంగా యాంకర్ వైష్ణవికి ఒక ఆసక్తికరమైన ప్రశ్న వేశారు. సిద్ధు జొన్నలగడ్డ, విరాజ్, ఆనంద్ దేవరకొండ.. ఈ ముగ్గురిలో ఎవరితో లవ్, ఎవరితో పెళ్లి, ఎవరికి బ్రేకప్ చెప్తారని అడిగారు. ఇక దీనికి వైష్ణవి ఏమాత్రం తడబడకుండా విరాజ్‌కి బ్రేకప్ చెప్పేస్తానని, సిద్ధు జొన్నలగడ్డతో లవ్ అని, ఆనంద్ దేవరకొండను మాత్రం పెళ్లి చేసుకుంటానని సమాధానమిచ్చింది. దీంతో ఈ కామెంట్స్ నెట్టింట ఒక్కసారిగా వైరల్ అయ్యాయి. దేవరకొండ ఫ్యామిలీలోకి మరో హీరోయిన్ ఎంట్రీ ఇవ్వబోతోందని టాక్ మొదలైంది.

# పొరుగు భాషల్లోనూ వరుస అవకాశాలు

టాలీవుడ్‌లో ట్రెండింగ్ కథానాయికగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంటోంది తెలుగమ్మాయి అనంతిక సనిల్ కుమార్. చిన్నతనం నుంచే కళలను శ్వాసించిన ఈ భామ.. ప్రస్తుతం పొరుగు భాషల్లోనూ వరుస అవకాశాలు దక్కించుకుంటూ పరిశ్రమలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తోంది. ఎల్.కే.జీ చదువుతున్న రోజుల నుంచే నృత్యం, యుద్ధ విద్యలు (ఫైట్స్) వంటి విభిన్న కళా రూపాలను సాధన చేయడం తన అభిరుచిగా మార్చుకున్నానని తెలిపింది. శారీరక శ్రమతో కూడిన ఈ సాధనే నటిగా తన హావభావాలను, ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి ఎంతగానో దోహదపడిందని వివరించిన తీరు ఆశ్చర్యపరుస్తోంది. అవకాశం వచ్చిన ప్రతి భాషనూ గౌరవిస్తూ తమిళం, మలయాళం, తెలుగు భాషల్లో సమాంతరంగా ప్రాజెక్టులు అంగీకరిస్తున్నట్లు అనంతిక వెల్లడించింది. ఊరికే ఇంట్లో సమయాన్ని వృథా చేయడం తనకు అస్సలు నచ్చదని.. దేవుడు రోజులో అందించే సమయాన్ని కళా సాధనకే కేటాయిస్తుంటానని పేర్కొంది. డ్యాన్స్, రకరకాల పాత్రల సాధన ద్వారా నటనలోని లోతులను సులభంగా అర్థం చేసుకోగలిగానని తెలిపింది. ఏ ఒక్క భాషకే పరిమితం కాకుండా.. ఎక్కడ మంచి కథలు లభిస్తే అక్కడ తన నటనతో ఆకట్టుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఈ యంగ్ బ్యూటీ వెల్లడించింది.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467